# ఆమె... ఓ అద్భుతం !

—కిరణ్‌బాల

**'పువ్వులేరి తేవే చెలీ.... పోవలె కోవెలకూ**
**నీ వలెనే సుందరములు... నీవలె సుకుమారములు !'**

ఆ పాట ఎప్పుడు విన్నా... నాకళ్లముందో విశిష్ట వ్యక్తిత్వం కదలాడుతూ ఉంటుంది!

**మనుషుల్లో 'మంచితనం' అనే పువ్వుల్ని ఏరుకునే పసిమనసు ఆమెది! ఆమె... అమృతలత !**

## పంచిపెట్టే తత్వం:

'ప్రసాదం' తప్ప తోటివారికి మరోటి పంచిపెట్టడానికిష్టపడని ఈ రోజుల్లో... ఆవిడ తాను చేపట్టిన ప్రతీ సంస్థలో.... ప్రతిభావంతులకి భాగ స్వామ్యాన్ని పంచారే తప్ప... ఒకర్ని కోరలేదు !

పంచి పెట్టడంలోని ఆనందాన్నీ, తృప్తినీ... తనివితీరా అనుభవించడం.... కేవలం ఒక్క 'అమ్మ'లో... 'అమృత' లో మాత్రమే చూస్తాం !

**'నాది' అనే ఏకవచనాన్ని ఆమె భరించలేరు... 'మనది' అనే ఐకమత్యం ఆమెకు ప్రాణం !**

## ఎన్ని కలలో... అన్నికళలు !

'నీలో ఈ కళ ఉంది'. అని ఎదుటి వారిలో.... వారికిసైతం తెలీని కళని పసికట్టి.... 'నాకు రాదు బాబోయ్ - నన్ను వదిలేయండి' అన్నా వినకుండా, వాళ్ళచేత కళా ప్రదర్శన చేయించి, పదిమంది చేత శభాష్ అనిపించేంత వరకూ వూరుకోరు.

**ఆమె సామ్రాజ్యంలో ఎటుచూసినా మేధావులూ, కళాకారులే !**
**ఒక్కొక్కరూ ఒక్కోకళలో నిష్ణాతులు !**

ప్రతికళలోనూ ఆమెకు ప్రవేశమూ, ప్రదర్శనమూ ఉన్నాయనటం కంటే... ఆమె తన సలహాలతో- .... ఆయా కళలకు తుది మెరుగులు దిద్ది... జనరంజకం అయ్యేలా చూస్తారు అనటం సబబు !

## రచనాపటుత్వం....

తన రచనలో ఒక అక్షరం తక్కువైతే ఎక్కడ అర్థం మారిపోతుందో అనీ... మరోపదం ఎక్కువైతే ఎక్కడ అపార్థం ధ్వనిస్తుందో అనీ... రాసిన ప్రతి వాక్యం ఒకటికి పదిసార్లు 'ఎడిట్' చేసుకుంటూ... అత్యల్ప మాటల్లో - అనల్ప భావాల్ని పొదిగి, పొందుపరిచి - సరళమైన భాషలో పాఠకుల ముందుంచడం ఆమెకి వెన్నతో పెట్టిన విద్య !

## క్లాస్‌రూం...

'టీచర్లుండేది క్లాసురూముల్లో కాదు.... 'గ్లాసురూము'ల్లో ! మనమేం చేసినా... విద్యార్థులు నలుమూలల్నుండీ మనల్ని పరికిస్తూవుంటారు! పాఠాలు చెప్పడంలోనే కాదు.... మన వ్యక్తిగత నడతలోకూడా మనం విద్యార్థులకి ఆదర్శంగా ఉండాలి' అంటారు అవిడ !

## బోధనా నైపుణ్యం...




చాలామంది టీచర్లు అశ్రద్ధ చూపించే సాంఘిక శాస్త్రాన్ని ఎలా బోధించాలో ఆమె దగ్గరే నేర్చుకోవాలి మనం !

నా అనుభవంలో.... ఒక నాటి సంఘటన !
ఎండాకాలం... ఆరు బయట... ఓ రాత్రి...

ఆకాశంలోని చుక్కల్ని కలుపుతూ.... ఆమె 'విమాన మార్గాలు' బోధించిన వైనం, పైగా అవి కలిపితే 'గాలిపటం' ఆకారం వస్తుందనీ, బెంగుళూరు నగరం ఆ 'గాలిపటం తోక'... అని చెప్పిన సంగతి గుర్తొస్తే: 'ఔరా! పాఠాలు చెప్పడానికి చుక్కలు కూడా పనికొస్తాయా?' అనే ఆశ్చర్యం ఒకపక్కా– 'ఓహ్ ! ఇన్నాళ్లకి... బ్లాక్‌బోర్డ్, చాక్‌పీస్, క్లాస్‌రూమూ... ఏవీ లేకున్నా... ఎక్కడైనా అలవోకగా పాఠం చెప్పగలిగే ఒకగొప్ప సోషల్ టీచర్‌ను చూశాను' అన్న ఆనందం మరోపక్కా... ముప్పిరిగొని.... నాకు నిజంగానే చుక్కల లోకం కన్పించింది.... ఆ క్షణంలో !

## 'టైమ్ సెన్స్'...

"ఏ టీచరైనా క్లాసులో ఒక పీరియడంతా- ఏమీ చెప్పకుండా పొద్దుపుచ్చినా- ఏదో చెప్పి పొద్దు గడిపినా - ఆరోజు.... ఆ పీరియడ్ కొరకు.... ఆటీచర్ కిచ్చే 45/-★ రూ॥ల జీతం వేస్ట్ ! అంతకన్నా ముఖ్యం... ఆ విద్యార్థులకి మళ్ళీ తిరిగిరాని - అత్యంత విలువైన ఆ 45 నిమిషాల సమయం వేస్ట్ !

'నేను విద్యార్థినుండి **నిమిషానికో రూపాయి** తీసుకుంటున్నాను కాబట్టి.... వాడి ప్రతీ నిమిషం సద్వినియోగం చేయాలి' అన్న స్పృహతో.... బోధించేవాడు ఉత్తమ ఉపాధ్యాయుడు !" అంటారు ఆవిడ.

## ఆమె సహనం...

'ఫలానా వాళ్ళు మిమ్మల్ని తెరమరుగు చేయడానికి ప్రయత్నిస్తున్నారూ' అంటే– 'నేను తెరవెనుక సూత్రధారిని ! వాళ్ళకీ పాత్రలు కొత్తకదా ! ఉబలాటం సహజం ! లెటజ్ ఎంకరేజ్ దెమ్ !' అంటారు నవ్వుతూ.
భిన్న ధృవాలనూ, విభిన్న దృక్పథాలనూ అలా 'కలిపి' ఉంచుతారు ఆవిడ.

---

★ ఒక టీచర్ వేతనం నెలకి 5,000/- రూ॥లు అనుకుంటే....❋ ఒక పనిదినానికి ఆ టీచర్ కిచ్చే వేతనం: రూ॥ 227/- (రూ॥ 5000 ÷ 22 పనిదినాలు) ❋ ఒక పీరియడ్ కి ఆ టీచర్ కిచ్చే వేతనం: రూ॥ 45/-(రూ॥ 227 ÷ 5 పీరియడ్‌లు) ❋ ఒక నిమిషానికి ఆ టీచర్ కిచ్చే వేతనం: రూ॥ 1/- (రూ॥ 45 ÷ 45 నిమిషాలు)

## 'పని'మనిషి !

ఊపిరి సలపని పని ఒత్తిడిలో నలిగిపోయే ఎలాంటి వారైనా... కాస్త రిలాక్స్ అవ్వాలని కోరుకుంటారు ! విరామంలేకుండా పనిచేస్తూ... పనిమీదే మనసు పెట్టే ఆమె - ఏ పనీ లేని సమయంలో ఏదో ఒక పనిని (గార్డెనింగ్, పెయింటింగ్, ఇంటీరియర్ డెకరేషన్) కల్పించుకోవడం చూస్తే - 'అబ్బో, ఈ కళలు కూడా ఉన్నాయా !?' అని ఆశ్చర్యం వేస్తుంది. వెరైటీ, క్రియేటివిటీ, పర్ఫెక్షన్‌లను తాను ముట్టుకున్న ప్రతి పనిలోనూ కోరుకుంటారు. ఆమెది **గోల్డెన్ టచ్ !**

ఆమె ఏదైనా పనిలో వున్నప్పుడు -

ఒకవేళ అల వైకుంఠపురం విడిచి - సాక్షాత్తూ శ్రీమన్నారాయణమూర్తే దిగివచ్చి - 'మోక్షమిస్తాను - రావమ్మా !' అంటే -

"ఎలాగూ వచ్చారు కదా స్వామీ ! కాసేపు ఆగండి ! బోర్ కొడ్తే....ఆ కంప్యూటర్ దగ్గర కూర్చుని కాస్త 'ప్రూఫ్' చూడండి! ఈలోగా నేనీ పని పూర్తి చేసుకుంటాను!" - అని అన్నా అనే రకం !

అలా - మోక్షం కన్నా - పనేముఖ్యం అనుకునే - 'పని'మనిషి ఆమె !

## ఆమెకు కోపం వచ్చే క్షణాలు....

కొన్నిసార్లు... ముఖ్యంగా... తనకిష్టమైన వస్తువులు స్థానభ్రంశం చెందినపుడు... ఇంపార్టెంట్ కాగితాలూ గట్రా కనిపించనపుడు... చేయగలిగే వాళ్ళు చేయాల్సిన పని సకాలంలో పూర్తిచేయనపుడు.... ఇంట్లోగానీ, ఆఫీసులోగానీ ఏమూలైనా బూజూ, దుమ్మూ.... వగైరాలు దర్శనమిచ్చినప్పుడు !

నిజంగా.... ఆమె కోపం క్షణాలే !

## ఆమె గొప్పతనం !

'ప్రతి వ్యక్తిలోనూ మంచీ, చెడూ రెండూ ఉంటాయి. ఎదుటి వ్యక్తిలోని మంచిని మాత్రమే మనం ఫోకస్ చేయాలి. అప్పుడు ఆ వ్యక్తిలోని చెడు తనకు తానే సంస్కరింపబడుతుంది!' అని చెప్పే ఆమె మాటల్లో కనిపించేది.... మనుషుల మనస్తత్వం మారుతుందన్న ఆశాభావమో - మార్చవచ్చన్న ప్రగాఢ విశ్వాసమో - ఏదో గానీ... ఇలాంటి విశిష్ఠ వ్యక్తి సాన్నిధ్యంలో మసలే ఏ వ్యక్తికైనా - **వ్యక్తిత్వం వికసిస్తుంది!** మనం ఏమిటో - ఎలా వుండాలో - ఆగ్రహాన్నైనా- అనుగ్రహాన్నైనా ఎలా నిగ్రహించుకోవచ్చో - గ్రహిస్తాం !

**'క్షమ'తో శత్రువుని శిక్షించడమే కాదు- 'మరపు' అనే వరమిచ్చి, కృతఘ్నుల్ని క్షమిస్తారు ఆవిడ !**

## ఆమె బలహీనత !

మొహమాటం... వదరుబోతులను భరించటం (తలబొప్పికట్టినా సరే...)

## ఆమె చిరాకుపడేది.....

చాడీలు చెప్పేవాళ్ళమీదా - పెద్దగా అరిచేవాళ్ళమీదా - చీప్ కామెంట్స్ చేసేవాళ్ళమీదా.

## ఆమె అసూయ పడేది !

ఓనాడు ఆమె విషయంలో ఓ అనుమానం వచ్చి - 'మీకెప్పుడైనా అసూయ కలిగిందా ?' అడిగాను - (అది అంతఃశత్రువు కదా వుండేవుంటుందనుకుని!)

'కలిగింది' అన్నారు.

'ఎప్పుడు ?' - (దొరికిపోయారు దొంగనుకుని అడిగాను సంబరంగా.)

'ఏ సంస్థకైనా పెద్ద ప్లేగ్రౌండ్‌ని చూసినపుడు ! నా చేతిలో గనుక.... అంత లాండ్ వుంటేనా... ఝూమ్మని ఎన్నెన్నో ప్లాన్స్ వేసేసేదాన్ని'- అదీ ఆమె సమాధానం!

(బోడి, ఇదీ ఓ అసూయేనా !?)

## ఎన్నికోణాలో....

'ఒక బిందువు నుండి... ఎన్ని కోణాలు గీయవచ్చు ?' అని ప్రశ్నిస్తే...
'$360^0$ వరకూ.... ఎన్ని కోణాలైనా గీయవచ్చు !' అని సమాధానం!

**వినయం** - ఆమె ముందు మరీ ఒదిగి ఉంటుంది !

**మర్యాద** - ఆ ఇంటిముందే బైఠాయించి - పొమ్మన్నా పోనని ముందే చెప్తుంది.

ఎప్పుడో ఓసారి - ఎక్కడో ఓదగ్గర - తనని అసంతృప్తికి గురిచేసే మనుషుల మధ్య - 'తృప్తి' - ఆమెని చూసుకునే - సంతృప్తి పడుతుంది !

ఆమెకు ఉన్నవి... ఎన్నెన్నో !

- స్వయంకృషి, ఆత్మవిశ్వాసం, ఆప్యాయత ఎట్సెట్రా.

ఆమెకు లేనివి కూడా ఉన్నాయి !

- అహంకారం, అజ్ఞానం, అపనమ్మకం ఎట్సెట్రా.

ఇలా ఏ కోణంలోంచి చూసినా.... ఆమె సంపూర్ణత మనకి $360^0$ లలో సాక్షాత్కరిస్తుంది !

స్త్రీగా ఆమె - **A complete woman !**
వ్యక్తిగా ఆమె - **A complete human !**

## హృదయాహ్లాదిని...

తన ఇంట్లోనే కాదూ, చేపట్టిన ఏ విద్యాసంస్థలోనైనా.... పచ్చగా కళకళలాడే వాతావరణం ఆమెకిష్టం. తన వాళ్ళూ- తన దగ్గరికి వచ్చేవాళ్ళూ ఎప్పుడూ ఏ టెన్షన్స్ లేకుండా... 'హాయి'గా ఉండాలని... ఆమె కోరుకుంటారు! అందుకే ఆమె ఇల్లు ఓ 'ఆహ్లాదం' !

ఆమె కళాకారిణి, కళాపోషకురాలు, సౌందర్యోపాసి, జ్ఞాన పిపాసి !

**ఆమె కీర్తి... కొండెత్తు - వినయం నిలువెత్తు !**

★ ★ ★